సగం మంది రైతులకే రుణమాఫీ

- బ్యాంకుల వన్‌టైం సెటిల్‌మెంట్‌తో తెలంగాణ రైతులకు తప్పని తిప్పలు
- రాజ్యసభలో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్
- తెలంగాణ రైతుల దీనస్థితిని ఎత్తి చూపినందుకు కృతజ్ఞతలు: కేటీఆర్

హైదరాబాద్, మార్చి 27(నమస్తే తెలంగాణ): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన రుణమాఫీతో రైతులు అటూ ఇటూ కాకుండా పోయారని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ వ్యాఖ్యానించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సగం మందికే రుణమాఫీ అమలు చేసిందని బీఆర్‌ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ ఆమె కాంగ్రెస్ ప్రభుత్వంపై సంచలన ఆరోపణలు చేశారు. బుధవారం రాజ్యసభలో బ్యాంకింగ్ లాస్ అమెండ్‌మెంట్ బిల్లుపై జరిగిన చర్చలో సీతారామన్ మాట్లాడారు. తెలంగాణలో సగం మంది రైతులకు రుణమాఫీ కాలేదని ఆరోపించారు. రైతులందరికీ ప్రయోజనం దక్కకపోయినా ప్రభుత్వం మాత్రం అందరికీ మాఫీ చేసినట్టు గొప్పలకుపోయిందని విమర్శించారు. ప్రభుత్వ ప్రకటనను బ్యాంకులు పరిగణనలోకి తీసుకొని వన్‌టైం సెటిల్‌మెంట్ కింద రుణాలను రద్దు చేస్తున్నాయని సభ దృష్టికి తీసుకువచ్చారు. వన్‌టైం సెటిట్‌మెంట్‌తో రైతులు కొత్త రుణాలు తీసుకునేందుకు అర్హత కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో బ్యాంకు రుణాలు అందక రైతులు ఇబ్బందులు పడతారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మేలు చేయకపోగా.. నష్టం చేస్తున్నదని ఆ గ్రహం వ్యక్తం చేశారు. 2008లో యూపీఏ ప్రభుత్వం దేశవ్యాప్తంగా అమలుచేసిన రుణమాఫీ కారణంగా, ఆ తర్వాత రైతులకు కొత్త రుణాలు అందని పరిస్థితి నెలకొన్నదని గుర్తుచేశారు.

సీఎంకు వ్యక్తిగత సిబ్బందిలా టీబీజేపీ నేతలు

ఎక్స్‌లో మాజీ మంత్రి కేటీఆర్

కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ వ్యాఖ్యలపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్ వేదికగా కృతజ్ఞతలు చెప్పారు. తెలంగాణ రైతుల దీనస్థితిని ఎత్తిచూపిన నిర్మలకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో 30 శాతం మంది రైతులకు రుణమాఫీ కాలేదని ఆరోపించారు. అన్నదాతల ఆత్మహత్యలు పెరుగుతున్నాయని, రైతుబంధు విడుదల చేయడం లేదని విమర్శించారు. దశాబ్దం తర్వాత తెలంగాణ రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అయినప్పటికీ తెలంగాణ బీజేపీ నేతలు మాత్రం సీఎంకు వ్యక్తిగత సిబ్బందిలా పని చేస్తున్నారని ఆరోపించారు. రైతులకు మద్దతుగా ఒక్క మాట కూడా మాట్లాడటం లేదని మండిపడ్డారు.

యువజన కాంగ్రెస్ నేతపై పోక్సో కేసు

మైనర్‌పై లైంగికదాడికి పాల్పడ్డాడని ఫిర్యాదు

కల్వకుర్తి రూరల్, మార్చి 27 : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తికి చెందిన బాలికపై లైంగికదాడి కేసులో యువజన కాంగ్రెస్ నేత అనిల్‌గౌడ్‌పై పోక్సో‌తోపాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. అనిల్‌గౌడ్ ఎస్టీ బాలికకు మాయమాటలు చెప్పి అఘాయిత్యానికి పాల్పడడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో అతడిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై మాధవరెడ్డి తెలిపారు.

విద్యుత్తు లైన్ మార్చేందుకు రూ. 30 వేలు డిమాండ్

ఏఈని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు

దుండిగల్, మార్చి 27: ఓ వ్యక్తి నుంచి లంచం తీసుకుంటుండగా ఏఈని ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న సంఘటన జీడిమెట్లలో చోటుచేసుకుంది. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. జీడిమెట్ల విద్యుత్తు సబ్‌డివిజన్ పరిధిలోని డీ పోచంపల్లి సబ్‌స్టేషన్‌లో ఏఈగా ఎస్ సురేందర్‌రెడ్డి పనిచేస్తున్నాడు. ఈక్రమంలో బౌరంపేటకు చెందిన ఓ వ్యక్తి తన ఇంటికి 11కేవీ విద్యుత్తు లైన్‌స్థానంలో కేబుల్ వైర్ వేయాలని సురేందర్‌రెడ్డిని సంప్రదించాడు. దీనికి సురేందర్‌రెడ్డి రూ. 30 వేలు డిమాండ్ చేయగా, బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ అధికారుల సూచన మేరకు.. గురువారం సురేందర్‌రెడ్డికి రూ.30 వేలు ఇస్తుండగా అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం సురేందర్‌రెడ్డిని నాంపల్లిలోని ఏసీబీ కోర్టుకు తరలించారు. ఏసీబీ దాడుల్లో సిటీ రేంజ్ యూనిట్-2 ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగి డబ్బులు డిమాండ్ చేస్తే 1064కి సమాచారం అందించాలని సూచించారు.

మాకూ క్యాబినెట్ బెర్త్ కావాలి

- ఢిల్లీకి కాంగ్రెస్ నేతల క్యూ
- అధిష్ఠానం వద్ద జోరుగా పైరవీలు
- కార్పొరేషన్, పీసీసీ, డీసీసీ పదవులను ఆశిస్తూ మరికొందరు..

హైదరాబాద్, మార్చి 27 (నమస్తే తెలంగాణ): తెలంగాణ క్యాబినెట్ విస్తరణకు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో పదవులపై ఆశలు పెట్టుకున్న నేతలు కాంగ్రెస్ అధిష్ఠానం వద్దకు క్యూ కడుతున్నారు. మహబూబ్‌నగర్, నల్లగొండ, వరంగల్, ఆదిలాబాద్‌కు చెందిన కొందరు ఎమ్మెల్యేలు గురువారం రాత్రి ఢిల్లీ వెళ్లగా, మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఇప్పటికే ఢిల్లీలో తిష్ట వేశారు. అసెంబ్లీ సమావేశాలు ముగియగానే సాయంత్రం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డితోపాటు ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలు కూడా ఢిల్లీ బయలుదేరారు. క్యాబినెట్ విస్తరణలో ఎవరికి చోటు కల్పించాలి, ఎవరికి ఉద్వాసన పలకాలి అన్నదానిపై అధిష్ఠానం ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. అయినప్పటికీ నేతలు తమ వంతు చివరి ప్రయత్నంగా ఢిల్లీ వెళ్లి మంతనాలు సాగిస్తున్నారు. క్యాబినెట్ రేస్‌లో ప్రధానంగా సుదర్శన్‌రెడ్డి, ప్రేమ్‌సాగర్ రావు, వాకిటి శ్రీహరి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, మీర్‌అలీఖాన్, బాలునాయక్‌లు ఉన్నట్టు సమాచారం. మరోవైపు మాదిగ, లంబాడా, బీసీ వర్గాల నుంచి మంత్రి పదవులను ఆశించేవారి సంఖ్య పెరిగింది. ఈ నేపథ్యంలో అధిష్ఠానం దీనిని ఎలా పరిష్కరిస్తుందన్నదానిపై ఆసక్తి నెలకొంది.

మేము సైతం..

క్యాబినెట్ విస్తరణతోపాటు రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి కార్పొరేషన్ పదవులు, పీసీసీ, డీసీసీ పదవులకు కూడా ఎంపిక జరుగుతుందన్న ప్రచారం నేపథ్యంలో వాటిని ఆశిస్తున్న కాంగ్రెస్ నేతలు సైతం ఢిల్లీ బాటపట్టారు. పదేండ్లు పార్టీ కోసం కష్టనష్టాలను ఎదుర్కొని జెండా మోసిన తమకు న్యాయం చేయాలని వారు కోరనున్నారు. పనిలోపనిగా పలువురు డీసీసీ అధ్యక్షులు తమ జిల్లాల్లోని ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలపై అధిష్ఠానానికి ఫిర్యాదు కూడా చేస్తున్నట్టు సమాచారం. ఇప్పటికే పలువురు డీసీసీ అధ్యక్షులకు ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పదవులు దక్కాయి. సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్‌యాదవ్‌కు రాజ్యసభ సభ్యుడిగా, యాదాద్రి-భువనగిరి డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఎమ్మెల్యేగా, నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. వారి స్థానంలో కొత్తవారిని నియమించలేదు. ఒకే వ్యక్తికి, ఒకే కుటుంబానికి రెండు పదవులపై అధిష్ఠానానికి ఫిర్యాదు చేసినట్టు తెలిసింది.

రాతపూర్వక జవాబుఇవ్వాలి: హరీశ్‌రావు

హైదరాబాద్, మార్చి 27 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీలో ప్రశ్నోత్తరాలను రద్దు చేయడంపై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు గురువారం అసెంబ్లీలో నిరసన వ్యక్తంచేశారు. ఒక్కరోజు మాత్రమే ప్రశ్నోత్తరాలను నిర్వహించి, మిగతా రోజులు రద్దుచేయడం సరికాదని ఆయన పేర్కొన్నారు. జీరో అవర్‌లో సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు ప్రభుత్వం రాతపూర్వకంగా సమాధానాలు ఇవ్వాలని కోరారు. దీంతో స్పందించిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ గత 15 నెలల్లో సభ్యులు అడిన ప్రశ్నలకు 15 రోజుల్లో లిఖితపూర్వకంగా సమాధానాలు పంపించాలని సీఎస్, సహా ఇతర అధికారులకు ఆదేశించినట్టు సభకు వివరించారు.

15 నెలల్లో 2.16 లక్షల పింఛన్ల రద్దు

- పింఛన్ల సొమ్ము పెంపు హామీకి కాంగ్రెస్ పాతర
- 24.85 లక్షల మంది కొత్తగా దరఖాస్తు చేసుకున్నారు
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, మార్చి 27 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ 15 నెలల కాలంలో 2.16 లక్షల మంది ఆసరా పింఛన్లను సర్కార్ రద్దు చేసిందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. పింఛన్ల సొమ్ము పెంపు హామీని ఈ ప్రభుత్వం విస్మరించిందని, కొత్తగా దరఖాస్తులు చేసుకున్న లక్షలాది మందికి ఇంతవరకూ ఆసరా పింఛన్లను మంజూరు చేయలేకపోతున్నదని గురువారం ఎక్స్ వేదికగా నిప్పులు చెరిగారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నింటినీ అధికారంలోకి వచ్చాక పాతరేసిందని మండిపడ్డారు. నయవంచనే కాంగ్రెస్ సర్కారు నైజమని నిరూపితమైందని తెలిపారు. ఆసరా పింఛన్ల కోసం దరఖాస్తులు చేసుకున్న 24.85 లక్షల మంది ఎదురు చూస్తున్నారని తెలిపారు. పింఛన్ల కోసం బడ్జెట్‌లో కేటాయించిన రూ.4,000 కోట్ల నిధులు దారిమళ్లాయని ఆమె విమర్శించారు. పింఛన్ల నిధులను దారి మళ్లించడం అంటే పేదల నోటికాడి కూడు లాక్కోవడమేనని ధ్వజమెత్తారు. ఈ ప్రభుత్వం పేదలను దోచి, పెద్దలకు సద్ది కడుతున్నదని దుయ్యబట్టారు. ప్రభుత్వానికి మనసు, మానవత్వం ఉంటే ఆసరా పింఛన్ లబ్ధిదారులపై ఇంత నిర్దయగా వ్యవహరించదని పేర్కొన్నారు.

అసెంబ్లీ నిరవధిక వాయిదా

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ వెల్లడి

హైదరాబాద్, మార్చి 27 (నమస్తే తెలంగాణ): ఈ నెల 12న ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాలు గురువారం ముగిశాయి. మొత్తం 11 రోజుల్లో.. 97.32 గంటలపాటు సమావేశాలు కొనసాగాయని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రకటించారు. 12 బిల్లులు ఆమోదం పొందినట్టు తెలిపారు. 16 స్టార్డ్ ప్రశ్నలకు సమాధానాలు తెలిపినట్టు చెప్పారు. 27 ప్రశ్నలకు సమాధానాలు టేబుల్ చేసినట్టు పేర్కొన్నారు. సభ్యులు మొత్తం 146 ప్రసంగాలతో పాటు 3 తీర్మానాలు చేసినట్టు ఆయన వెల్లడించారు. కాగా, శాసనసభతో పాటు మండలి కూడా నిరవధికంగా వాయిదా పడ్డాయి.

దేశంలో కరెంటును కనిపెట్టిందే కాంగ్రెస్

మొదటిపేజీ తరువాయి...

సోషల్ మీడియాలో సెటైర్లు పేలుతున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి కరెంట్ పితామహుడేమో అంటూ కొందరు కామెంట్స్ పెడుతున్నారు. దేశంలో కాంగ్రెస్ లేకపోతే ప్రజలు ఏమైపోయేవారో అంటూ ఎద్దేవా చేస్తున్నారు.

అప్పులపై కుండబద్దలు

అప్పులపై రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. నెలకు అసలు, వడ్డీ కలిపి రూ.6,500 కోట్లు చెల్లిస్తున్నట్టు వివిధ వేదికలపై చెప్తూ వస్తున్న సీఎం.. తమ ప్రభుత్వం ఐదేండ్లలో రూ.6 లక్షల కోట్ల అప్పులు చేయాల్సిన అవసరం ఉంటుందని తెలిపారు. ఇప్పటికే 14 నెలల్లోనే రూ.1.58 లక్షల కోట్ల అప్పు చేసినట్టు వెల్లడించారు.

కేసీఆర్‌పై మరోసారి అనుచిత వ్యాఖ్యలు

బీఆర్‌ఎస్ అధికనేత, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికే కేసీఆర్ మరణాన్ని కోరుకుంటూ చేసిన వ్యాఖ్యలు పెద్ద దుమారం సృష్టించాయి. ఇప్పుడు మరోసారి కుటుంబ సభ్యులు ఆయనకు ఏదో హాని తలపెట్టేలా ఉన్నారంటూ ఎద్దేవా చేశారు. తాను కక్ష తీర్చుకోవాలనుకుంటే వాళ్లెవరూ బయట తిరగబోరంటూ బీఆర్‌ఎస్ నేతలను ఉద్దేశించి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. రేవంత్‌రెడ్డి తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పదేండ్లు సీఎంగా పనిచేసిన కేసీఆర్‌కు కనీస గౌరవం ఇవ్వకుండా వ్యవహరించడమేంటనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సీఎం స్థానంలో కూర్చున్నా రేవంత్ తీరు మారలేదని మండిపడుతున్నారు.

సంక్షేమానికి పెద్దపీట

రూ.1,44,156 కోట్ల కేటాయింపు

ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్, మార్చి 27 (నమస్తే తెలంగాణ): సబ్బండ వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ సర్కారు పెద్దపీట వేసిందని, రూ.3.4 లక్షల కోట్ల బడ్జెట్‌లో 1,44,156 కోట్లు కేటాయించడమే అందుకు నిదర్శనమని ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గురువారం అసెంబ్లీలో ద్రవ్యవినిమయ బిల్లుపై జరిగిన చర్చలో సమాధానం ఇస్తూ మాట్లాడారు. ఎస్సీ సబ్‌ప్లాన్‌కు ఏకంగా రూ.40 వేల కోట్లు కేటాయించామని, ప్రతిపైసా ఖర్చు చేస్తామని తెలిపారు. శక్తి మేరకు పెండింగ్ బిల్లులు చెల్లిస్తున్నట్టు చెప్పారు. బీసీ, ఎస్సీ, ఇతర కార్పొరేషన్ల పటిష్ఠానికి చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు.

దక్షిణాదిపై కేంద్రం దాడిని తిప్పికొడదాం

- అన్ని పార్టీలు కలిసి పోరాడదాం
- త్వరలోనే డీలిమిటేషన్‌పై మీటింగ్
- అసెంబ్లీ సీట్లను 153కు పెంచాలి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తూ అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం

హైదరాబాద్, మార్చి 27 (నమస్తే తెలంగాణ): దక్షిణాది రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం కత్తిగట్టిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు. దక్షిణాదిపై కేంద్రం చేస్తున్న దాడిని అన్ని పార్టీలు, పాలకపక్షాలు కలిపి సమర్థంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. గురువారం అసెంబ్లీలో డీ లిమిటేషన్‌ను వ్యతిరేకిస్తూ తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన దిశగా కేంద్రం చేస్తున్న ప్రయత్నాలు, అనుసరించబోయే విధివిధానాలు, రాష్ట్ర ప్రభుత్వాలతో పారదర్శకమైన సంప్రదింపులు లేకుండా జరుగుతున్న కసరత్తుపై ఈ సభ తీవ్ర ఆందోళన వ్యక్తంచేస్తున్నదని పేర్కొన్నారు. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, అన్ని రాజకీయ పార్టీలు, భాగస్వామ్య పక్షాలతో విస్తృతమైన సంప్రదింపుల తర్వాత పునర్విభజన కసరత్తును పారదర్శకంగా చేపట్టాలని సభ కోరుకుంటున్నదని తెలిపారు. నియోజకవర్గాల పునర్విభజనకు జనాభా ఒక్కటే ప్రామాణికం కాకూడదని చెప్పారు. పార్లమెంట్ సీట్ల సంఖ్యను యథాతథంగా కొనసాగించాలని, రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకుని ఇప్పుడున్న నియోజకవర్గాల సరిహద్దుల మార్పులు చేర్పులు చేయాలని కోరారు. తాజా జనాభా లెక్కలకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ సీట్లను పెంచాలని, మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.

24 నుంచి 19 శాతానికి సీట్లు తగ్గొచ్చు!

దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరిగేలా కేంద్రం వ్యవహరిస్తే, కచ్చితంగా అందరం కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ విషయమై కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదిద్దామని, అవసరమైతే పోరాటబాట పడుదామని చెప్పారు. కేంద్రానికి 36% పన్నులు చెల్లిస్తున్నా మనకు ఇచ్చే విషయంలో కేంద్రం వెనకాడుతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ వివక్షలకు వ్యతిరేకంగా త్వరలోనే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కాంగ్రెస్ సీనియర్ నేతలు జానారెడ్డి, కే కేశవరావు ఆధ్వర్యంలో అన్ని పార్టీలతో సమావేశం నిర్వహిస్తామని, అందరూ రావాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం తెలంగాణలో ఉన్న 119 అసెంబ్లీ నియోజకవర్గాలను 153 వరకు తక్షణమే పెంచాలని ఈ సభ తీర్మానిస్తున్నదని సీఎం చెప్పారు.

బీసీ కమిషన్‌కు పవర్‌కట్!

- సమావేశంలో కరెంట్ కోతలు
- చీకట్లోనే చీకటి బతుకుల వ్యథ విన్న సభ్యులు
- వీడియోగ్రాఫర్ కెమెరాలైట్ ఆధారంగా నోట్ చేసుకున్న వైనం

జగిత్యాల జిల్లా ధర్మపురిలో కెమెరాలైట్ ఆధారంగా మాట్లాడుతున్న బీసీ కమిషన్ చైర్మన్

ధర్మపురి, మార్చి 27 : బీసీ కులాల్లో ఉన్న దొమ్మర, వీరముష్టి కులాల స్థితిగతులను తెలుసుకునేందుకు జగిత్యాల జిల్లా ధర్మపురికి వచ్చిన బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులకు చేదు అనుభవం ఎదురైంది. సాయంత్రం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో చీకట్లోనే దొమ్మర సామాజిక వర్గానికి చెందినవారి వ్యథను కమిషన్ సభ్యులు విన్నారు. కెమెరా లైట్‌ఫోకస్ కిందనే స్థితిగతులను నోట్ చేసుకున్నారు. బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు జిల్లా పర్యటనలో భాగంగా గురువారం సాయంత్రం 5 గంటలకు ధర్మపురికి చేరుకున్నారు. దుర్గాకాలనీలో సాయంత్రం 6.15 గంటలకు సమావేశం ప్రారంభమైంది. 6.30 గంటలకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో సాయంత్రం 7గంటలకు వరకు చీకట్లోనే సమావేశం సాగింది. రాష్ట్ర క్యాబినెట్ మంత్రి స్థాయి, హైకోర్టు న్యాయమూర్తి స్థాయి హోదా, ప్రొటోకాల్ కలిగిన బీసీ కమిషన్ చైర్మన్ కార్యక్రమంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంపై సభ్యులు అసహనం వ్యక్తం చేసినట్టు కనిపించింది.

'మల్టీ లెవల్' కబ్జా

- పార్కింగ్ లాట్ నిర్మాణంలో అక్రమాలు
- కేబీఆర్ పార్క్ వద్ద నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం
- అధికారుల నిర్లిప్తతపై విస్మయం వ్యక్తం చేస్తున్న వాకర్స్

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 27 (నమస్తే తెలంగాణ): కేబీఆర్ పార్కు వద్ద చేపట్టిన మల్టీ లెవల్ పార్కింగ్ పనులు టెండర్ నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. పనులు దక్కించుకున్న ఏజెన్సీ స్థల వినియోగంలో అక్రమాలకు పాల్పడుతున్నట్టు తెలుస్తున్నది. జీహెచ్‌ఎంసీ నుంచి పొందిన స్థలానికి అదనంగా తవ్వకాలు జరపడంతోపాటు ఇప్పటికే ఫుట్‌పాత్‌లపై ఉన్న బస్‌స్టాప్‌లను తొలగించారు. రోడ్డువైపు ఉన్న ఫుట్‌పాత్‌ను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. తాజాగా రాత్రికి రాత్రే కేబీఆర్ పార్కు బయట జీహెచ్‌ఎంసీకి చెందిన వాక్‌వేకు రక్షణగా ఉన్న ప్రహరీని కూల్చేశారు. సుమారు 30 అడుగుల పొడవు, 6 అడుగుల వెడల్పు స్థలాన్ని ఆక్రమించుకున్నట్టు మార్నింగ్ వాకర్స్ ఆరోపిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ వాక్‌వేలోని స్థలాన్ని కాపాడాల్సిన యూబీడీ, ఇంజినీరింగ్ విభాగం అధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారికంగా పార్కింగ్ స్థలం కోసం జీహెచ్‌ఎంసీ నుంచి 484 గజాల స్థలాన్ని తొలుత 10 ఏండ్లు ఆ తర్వాత ఫలితాలను బట్టి మరో ఐదేండ్లపాటు లీజుకు దక్కించుకున్న నవ నిర్మాణ్ అసోసియేట్స్ సుమారు 1000 నుంచి 1500 గజాల స్థలాన్ని కాజేసేందుకు ప్రణాళిక రచిస్తున్నదని, ఇటీవల నమస్తే తెలంగాణ ఓ కథనాన్ని ప్రచురించింది. ఈ క్రమంలోనే గడిచిన రెండ్రోజులుగా రాత్రిపూట జీహెచ్‌ఎంసీ వాక్‌వేకు చెందిన ప్రహరీని కూల్చేసి స్థలాన్ని కబ్జా చేయడం విస్మయానికి గురిచేస్తున్నది. ఇదిలా ఉండగా మొదట వేసిన ప్లాన్‌ను పక్కనబెట్టి మరింత ఎక్కువ స్థలంలో ర్యాంప్ నిర్మాణం కోసం కొత్తగా పార్కింగ్ స్థలంలో గుంతలు తవ్వుతున్నారు. దీంతో మరో 100 గజాల స్థలాన్ని అదనంగా కలుపుకుంటున్నారని తెలుస్తున్నది. ఇక పార్కింగ్ స్థలంలో ఉన్న ఎలక్ట్రిక్ చార్జింగ్ పాయింట్‌ను నిరుపయోగంగా మార్చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొత్తం మీద కేబీఆర్ పార్కు బయట నిర్మిస్తున్న మల్టీ లెవల్ పార్కింగ్ కాంప్లెక్స్‌పై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఖరీదైన స్థలాన్ని కొట్టేస్తున్నారని వాకర్లు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. స్వచ్ఛ భారత్‌లో భాగంగా ఏర్పాటుచేసిన లూ కేఫ్‌ను కూడా తరలించనున్నట్టు వినికిడి. టెండర్ల ప్రక్రియ నుంచి పనుల దాకా సంబంధిత ఏజెన్సీకి అధికారులు కొమ్ముకాస్తున్నారనే ఆరోపణలున్నాయి. కమిషనర్ జోక్యం చేసుకోవాలని వాకర్లు కోరుతున్నారు.

50 లక్షల జాగ.. 28 కోట్ల ఫీజు!

మొదటిపేజీ తరువాయి...

ఫీజు ఖరారు చేస్తున్నారని, అవి అడ్డగోలుగా ఉంటున్నాయని భూయజమానులు వాపోతున్నారు. ఎక్కువగా ఫీజు వస్తుండటంపై గ్రీవెన్స్ సెల్‌కు కాల్ చేస్తే ఆ నంబర్ పనిచేయడంలేదని బాధితులు వాపోతున్నారు. ఎల్‌ఆర్‌ఎస్ ఫీజును కంప్యూటర్ ఆటోమెటిక్‌గా జనరేట్ చేసిందని, తామేమీ చేయలేమని అధికారులు చేతులెత్తేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎల్‌ఆర్‌ఎస్‌లో గందరగోళం నెలకొన్నది.

ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు రూ.28.94 కోట్లు

మంచిర్యాల జిల్లా నస్పూర్ మున్సిపాలిటీలో 1,331 గజాల ఇంటి స్థలాన్ని ఓ మహిళ కొనుగోలు చేశారు. బహిరంగ మార్కెట్ ధర ప్రకారం ఆ స్థలం విలువ సుమారు రూ.50 లక్షలు ఉంటుంది. లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ కింద భూక్రమబద్ధీకరణ కోసం 2020 సంవత్సరంలో ఆమె దరఖాస్తు చేసుకున్నారు. ఎల్‌ఆర్‌ఎస్ ఫీజుగా రూ. 28,94,48,603 చెల్లించాలని ఇటీవల లేఖ రావడంతో ఆమె కంగుతిన్నారు. అదే సర్వేనంబర్‌లో పక్కనే మరొకరికి రూ.14 లక్షల విలువైన 380 గజాల ప్లాట్ ఉన్నది. ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకోగా, రూ.5 కోట్లు ఫీజు చెల్లించాలని లేఖ అందింది.

ఒకే చోట వేర్వేరు ఫీజులు

వరంగల్ నగర పరిధిలో ఓ వైద్యుడు ఒకే సర్వే నంబర్‌లో 548 గజాల చొప్పున మూడు ప్లాట్లు కొనుగోలు చేశారు. ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకోగా, ఒక ప్లాట్‌కు రూ.90 వేలు, రెండో ప్లాట్‌కు రూ.98 వేలు, మూడో ప్లాట్‌కు రూ.2 లక్షలు ఫీజు చెల్లించాలని లేఖలు వచ్చాయి. ఒకే సర్వేనంబర్, ఒకే లేఅవుట్, ఒకే విస్తీర్ణం గల ప్లాట్లకు వేర్వేరు ఫీజు రావడంపై ఆయన ఆశ్చర్యపోతున్నారు. పెండింగ్-1, పెండింగ్-2 అని దరఖాస్తులో ఉన్నదని, ఎల్‌ఆర్‌ఎస్ డబ్బులు కట్టిన తర్వాత సర్వే చేస్తామని అధికారులు చెప్తున్నారని వాపోయారు. సర్వే చేయకముందే ఫీజు ఎలా చెల్లించాలని ప్రశ్నించారు.

తప్పు మాది కాదు.. కంప్యూటర్‌ది!

కరీంనగర్ శివారు అలుగునూరులోని 8వ డివిజన్‌లో ఓ వ్యక్తి ఒకే సర్వేనంబర్‌లో 183 గజాల చొప్పున మూడు ప్లాట్లు కొనుగోలు చేశారు. ఒకేరోజు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకోగా, గజానికి సుమారు రూ.380 చొప్పున రూ.67 వేలు చెల్లించాలని లేఖ అందింది. ఆ మొత్తం ఇంటి యజమాని చెల్లించారు. తర్వాత అంతే విస్తీర్ణంలో మరోప్లాటుకు గజానికి రూ.205 చొప్పన రూ.37 వేలు చెల్లించాలని రావడంతో కంగుతున్నారు. మొదటి ప్లాట్‌కు ఎక్కువ ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించినట్టు గుర్తించిన యజమాని, అదనంగా చెల్లించిన మొత్తాన్ని తిరిగి ఇవ్వాలని అధికారులను కోరారు. కంప్యూటర్ ఆటోమెటిక్‌గా ఫీజును ఖరారు చేస్తుందని, తామేమీ చేయలేమని అధికారులు చేతులెత్తేశారని బాధితుడు తెలిపారు.

లంబాడీ భాషను 8వ షెడ్యూల్‌లో చేర్చాలి

- కేంద్రానికి విజ్ఞప్తి చేస్తూ అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం



హైదరాబాద్, మార్చి 27 (నమస్తే తెలంగాణ): లంబాడీల 'గోర్‌బోలీ' భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చి, వారి భాషకు లిఖితరూపం ఇవ్వాల్సిందిగా కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం చేసింది. పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు గురువారం శాసనసభ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ, 'గోర్‌బోలీ' భాషను బంజారాలు, లంబాడా ప్రజలు ఎక్కువగా మాట్లాడతారని, వారందరినీ కలిపి 'గోర్‌మాటి' అంటే 'సొంతజనులు' 'స్వజనులు' అని పిలుస్తారని చెప్పారు. లక్షలాది మంది మాట్లాడుతున్న ఈ భాషకు లిఖితరూపం ఇవ్వడం సబబేనని పేర్కొన్నారు. మన దేశంలో లంబాడాలకు వేలాది ఏండ్ల చరిత్ర ఉన్నదని, అయితే 14వ శతాబ్దం నుంచి బంజారాల ప్రస్తావన చరిత్రలో కనిపిస్తున్నదని చెప్పారు. వీరి మూలాలు రాజస్థాన్‌లోని మేవాడ్ ప్రాంతంలో ఉన్నాయని, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో విస్తరించారని తెలిపారు. పదకొండుకుపైగా రాష్ట్రాల్లో ఆచరణలో ఉన్న 'గోర్‌బోలీ' భాషను కూడా 8వ షెడ్యూల్లో చేర్చడానికి కావలసిన చర్యలను భారత ప్రభుత్వం తీసుకోవాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు.

400 ఎకరాల వేలం ప్రక్రియను ఆపండి

సీఎం రేవంత్‌కు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లేఖ

హైదరాబాద్, మార్చి 27 (నమస్తే తెలంగాణ): ఆర్థిక వనరుల సమీకరణ పేరిట హైదరాబాద్ గచ్చిబౌలిలో ఉన్న 400 ఎకరాల ప్రభుత్వ భూమి వేలం ప్రక్రియను ఆపాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం సీఎం రేవంత్‌కు లేఖ రాశారు. భవిష్యత్తు అవసరాల కోసం భూముల వేలాన్ని ఆపాలని కోరారు. ఆర్థిక వనరుల పేరిట ప్రభుత్వ భూములను అమ్మడం దారుణమని పేర్కొన్నారు.

భూమి అమ్మినా బెట్టింగ్ అప్పు తీరలే

30 లక్షలు పోగొట్టుకున్న బాధితుడి తల్లి ఆవేదన

బెట్టింగ్ యాప్‌లను బ్యాన్ చేయాలని వినతి

బెట్టింగ్ యాప్ బాధితుడు వినయ్‌రెడ్డి

బెట్టింగ్ యాప్‌లను బ్యాన్ చేయాలంటున్న వినయ్‌రెడ్డి తల్లి శోభ

ఎల్లారెడ్డిపేట, మార్చి 27: కష్టమంటే తెలియకుండా పెంచి ఉన్నత చదువులు చదివిస్తే బెట్టింగ్ వ్యసనంగా మార్చుకుని అప్పులపాలైన కొడుక్కి ధైర్యం చెప్పేందుకు ఉన్న భూమి అమ్మేశారు. అయినా, అప్పు తీరలేదని.. తనలాంటి పరిస్థితి ఏ కుటుంబానికి రావొద్దని.. బెట్టింగ్ యాప్‌లను బ్యాన్ చేయాలని ఓ తల్లి ప్రభుత్వాన్ని వేడుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌కు చెందిన వంగల శోభ-లింగారెడ్డి దంపతులకు ఇద్దరు కొడుకులు. చిన్న కొడుకు వినయ్‌రెడ్డిని 2020లో హైదరాబాద్‌లోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదివేందుకు పంపించారు. మొదటి సంవత్సరం బాగా చదివి మంచి మార్కులు సాధించినప్పటికీ అప్పుడే క్రికెట్ బెట్టింగ్‌కు అలవాటుపడ్డాడు. అదే ఏడు కరోనా ఖాళీ సమయమంతా దానితోనే గడిపేవాడు. 2024 నాటికి పూర్తి వ్యసనంగా మారి తెలిసిన ప్రతి ఒక్కరి వద్ద అప్పు చేశాడు. ఇలా రూ.30 లక్షలు చేయగా, అందరూ అప్పు తీర్చమని వేధించడం మొదలుపెట్టారు. దీంతో కొంతకాలంగా ఇంట్లో మౌనంగా ఉంటున్న కొడుకును చూసి ఆరా తీయగా తల్లిదండ్రులకు విషయం చెప్పాడు. బయట తెలిస్తే పరువు పోతుందని అష్టకష్టాలు పడి అప్పుతీర్చారు. కొన్ని రోజులుగా టీవీలు, వార్తాపత్రికల్లో బెట్టింగ్‌యాప్‌లపై వస్తున్న కథనాలను చూసిన వినయ్‌రెడ్డి తల్లి శోభ మీడియాను ఆశ్రయించింది. తన కొడుకు లాగా ఎవరూ బెట్టింగ్‌కు అలవాటు పడవద్దని సూచించింది. చివరకు తమకున్న 20 గుంటల వ్యవసాయ భూమి అమ్మి కొంత వరకు అప్పు తీర్చినట్టు చెప్పింది. ఇంకా అప్పులవాళ్లు అడుగుతూనే ఉన్నారని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై దృష్టి

పెట్టాలని, ప్రభుత్వం బెట్టింగ్ యాప్‌లను బ్యాన్ చేయాలని చేతులెత్తి వేడుకున్నది. తమ కొడుకు లాంటి బాధిత యువకులకు ప్రభుత్వం కౌన్సెలింగ్ ఇవ్వాలని కోరింది. బాధిత యువకుడు మాట్లాడుతూ తాను బీటెక్ జాయిన్ అయిన కొత్తలో వన్ ఎగ్జిబిట్ బెట్టింగ్‌కు అలవాటు పడ్డానని, కరోనా సమయంలో ఈ యాప్ ద్వారా రూ.6 లక్షలు పోగుట్టుకున్నట్టు తెలిపాడు. అనంతరం ఫెయిర్ ప్లే యాప్‌కు అలవాటుపడి 2023లో రూ.22 లక్షల వరకు పోగొట్టుకుని బీటెక్ ఫెయిలై మానసికంగా దెబ్బతిన్నట్టు వివరించాడు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో మళ్లీ కోలుకుని చదువుతున్నానని చెప్పాడు. తన లాగా ఎవరూ బెట్టింగ్‌కు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని కోరాడు.